


# కరపత్రం

SINCE 2014


మంగళవారం డిసెంబర్ 17 2024 | సంపుటి :0 | సంచిక : 69 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4

## రాష్ట్ర ప్రభుత్వం ఏ జిల్లానూ రద్దు చేయదు: మంత్రి పొంగులేటి



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏ జిల్లానూ రద్దు చేయదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. పాత జిల్లాలను రద్దు చేయాలన్న ఆలోచన తమ ప్రభుత్వానికి లేదని చెప్పారు. శాసనమండలిలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రం వద్దకు నిధుల కోసం తరచూ వెళ్తాయని.. వెళ్లిన ప్రతిసారీ నిధులు రావని చెప్పారు. గతంలో భారాస హయాంలో ఎన్ని నిధులు వచ్చాయో తెలుసని ఎద్దేవా చేశారు. ఇది పేదల ప్రభుత్వమని.. పేదల కోసం పని చేస్తుందని పేర్కొన్నారు

# జాబ్ క్యాలెండర్ మేరకు నోటిఫికేషన్లు



హైదరాబాద్: ఉద్యోగ ఖాళీలు అంచనా వేసి టీజీపీఎస్సీ ద్వారా పరీక్షల నిర్వహణ చేపడుతున్నట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. శాసన మండలిలో ఆయన మాట్లాడారు. ప్రశ్నపత్రాల లీక్, మాల్ ప్రాక్టీస్ జరగకుండా పారదర్శకంగా పరీక్షల నిర్వహణ చేపడుతున్నట్లు వివరించారు. ఉద్యోగాల భర్తీ కోసమే జాబ్ క్యాలెండర్ ప్రకటించామని.. దశలవారీగా భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో నియామకాలు చేపడతామన్నారు. జాబ్ క్యాలెండర్ మేరకు నోటిఫికేషన్లు విడుదల చేస్తామని పేర్కొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా వాస్తవం: మంత్రి ఉత్తమ్

రేషన్ కార్డుల లెక్కలు పొంతన లేకుండా ఉన్నాయని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. కాకినాడ పోర్టుకు రేషన్ బియ్యం పోతోందని అనుమానాలు వ్యక్తం చేశారు. దీనికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా వాస్తవమన్నారు. ప్రజలు దొడ్డు బియ్యం తినట్లేదని.. సన్న బియ్యం ఇవ్వాలనే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

## బీఏసీ సమావేశం నుంచి భారాస, ఎంఐఎం వాకౌట్

తెలంగాణ స్పీకర్ ఛాంబర్‌లో బీఏసీ సమావేశం ముగిసింది.




హైదరాబాద్: తెలంగాణ స్పీకర్ ఛాంబర్‌లో బీఏసీ సమావేశం ముగిసింది. అసెంబ్లీ ఎన్నిరోజులు నిర్వహించాలన్న దానిపై ఎలాంటి [illegible] తీసుకోలేదు.

మిగతాది 2లో

## పురుటి నొప్పులతోనే గ్రూప్-2 పరీక్ష రాసి..!



మిగతాది 2లో

బల్మూరు: నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. పురుటి నొప్పులతోనే ఓ అభ్యర్థి గ్రూప్-2 పరీక్ష రాశారు. బల్మూరు మండలం బాణాల గ్రామానికి చెందిన రేవతి నాగర్ కర్నూల్ పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రూప్-2 పరీక్ష రాసేందుకు వెళ్లారు. పరీక్ష రాస్తున్న సమయంలోనే ఆమెకు పురుటినొప్పులు వచ్చాయి. అప్రమత్తమైన పరీక్ష నిర్వహణ సిబ్బంది.. ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు. అందుకు ఆమె అంగీకరించలేదు.

## గురుకులాల ఏర్పాటులో నిర్లక్ష్యం..

### కాంగ్రెస్ సర్కార్‌పై మండిపడ్డ ఎమ్మెల్సీ కవిత



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క బీసీ గురుకుల పాఠశాలను కూడా ఏర్పాటు చేయలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. కనీసం గురుకులాలను ఏర్పాటు చేయాలనే ఆలోచన కూడా ప్రభుత్వానికి లేకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు.

సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కేవలం19 బీసీ సంక్షేమ పాఠశాలలను మాత్రమే ఏర్పాటు చేసిందని తెలిపారు. కానీ పదేండ్లలో కేసీఆర్ 275 బీసీ పాఠశాలలను, 31 బీసీ డిగ్రీ కాలేజీలను, ప్రత్యేకంగా బీసీలకు రెండు వ్యవసాయ కాలేజీలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. బీసీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.14వేల కోట్లు విడుదల చేసిందని చెప్పారు.

దీని ద్వారా 15 లక్షల విద్యార్థులకు లబ్ధి జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా కొత్త బీసీ గురుకులాలు ఏర్పాటు చేయలేకపోవడం బాధాకరమని అన్నారు.

మిగతాది 2లో



మిగతాది 2లో

## ప్రజా సమస్యల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం పారిపోతుంది.. జగదీశ్ రెడ్డి ధ్వజం

ప్రజా సమస్యల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం పారిపోతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకులు జగదీశ్ రెడ్డి అన్నారు. ఎంత తప్పించుకున్నా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ఎండగడుతూనే ఉంటామని ఆయన స్పష్టం చేశారు.

### లగచర్ల రైతులకు న్యాయం జరిగే దాకా పోరాడతాం..

# అధైర్యపడొద్దు : కేటీఆర్



- తెలంగాణ అసెంబ్లీలో అరాచక, దుర్మార్గమైన ప్రభుత్వం తీరును ప్రజలు గమనిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు.
- భూములు ఇవ్వని పాపానికి దళిత, బలహీనవర్గాల రైతులను జైల్లో పెట్టారని మండిపడ్డారు.
- భూములు ఇవ్వమన్న రైతులపై కేసులు పెట్టడమే కాకుండా థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మిగతాది 2లో

లగచర్ల రైతులపై ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై శాసన సభలో చర్చించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పట్టుబట్టడంతో అసెంబ్లీని రేపటికి వాయిదా వేశారు. దీంతో శాసనసభ లోపలికి వెళ్లే దారిలో కూర్చుని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆందోళన చేపట్టారు. ప్లకార్డులతో నిరసనలు తెలిపారు. గిరిజన రైతులకు సంకెళ్లా.. ఇదేమి రాజ్యం.. ఇదేమి రాజ్యం.. దోపిడీ రాజ్యం.. దొంగల రాజ్యం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. లగచర్ల అంశంపై చర్చించరట కానీ.. పర్యాటకంపై చర్చిస్తామంటున్నారని మండిపడ్డారు.

లగచర్ల రైతులు ముగ్గురు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారని కేటీఆర్ తెలిపారు. ఓ రైతుకు గుండెపోటు వస్తే బేడీలతో ట్రీట్‌మెంట్ చేయించారని పేర్కొన్నారు. కొడంగల్ నీ జాగీరా.. రైతుల భూములు గుంజుకుంటారా అని మండిపడ్డారు. ఎన్ని కుయుక్తులు చేసినా రైతుల తరఫున పోరాడతామని స్పష్టం చేశారు. ఆదానీతో రేవంత్ దోస్తీని నిలదీయాలని టీషర్టులతో వస్తే లోనికి వెళ్లనీయలేదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. లగచర్ల రైతుల అంశంపై చర్చించాలని పట్టుబట్టినా చర్చ పెట్టలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకాలపై అసెంబ్లీలో నిలదీస్తామని స్పష్టం చేశారు. న్యాయం జరిగేదాకా పోరాడుతామని.. లగచర్ల రైతులు అధైర్యపడవద్దని ధైర్యం చెప్పారు. ఫార్మాసిటీకి 14 వేల ఎకరాలను సేకరించి పెడితే కాంగ్రెస్ ప్రభుత్వమే వద్దన్నదని తెలిపారు. రైతులకు రేవంత్ రెడ్డి భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## కక్షతో సర్పంచులను ఇబ్బందులు పెడుతున్నారు: హరీశ్‌రావు



హైదరాబాద్: తెలంగాణలో రూ.691 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బడా కాంట్రాక్టర్లకు మాత్రం బిల్లులు వస్తున్నాయని ఎద్దేవా చేశారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. ఏడాదిగా బిల్లులు చెల్లించకుండా సర్పంచులను గోస పెడుతున్నారని విమర్శించారు. గవర్నర్, మంత్రులను కలిసి వారు మొరపెట్టుకున్నారని చెప్పారు. చలో అసెంబ్లీ చేపడితే నిరసనకారులను అరెస్టు చేశారన్నారు. కాంగ్రెస్ హయాంలో ఏడాదిగా గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వట్లేదన్నారు. 15వ ఆర్థిక సంఘం, ఈజీఎస్ నిధులను మళ్లించారని ఆరోపించారు. తెలంగాణ పల్లెలను భారాస దేశానికి ఆదర్శంగా నిలిపిందని వివరించారు. కక్షతో సర్పంచులను ఇబ్బందులు పెడుతున్నారని.. గ్రామ పంచాయతీ ఎన్నికల లోపు బిల్లులు చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. లగచర్ల రైతులకు బేడీలు వేసి అవమానించారని పేర్కొంటూ అంతకు ముందు భారాస ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి నిరసన తెలిపారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులతో అసెంబ్లీకి వెళ్లేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకొని ప్లకార్డులు తీసుకొని లోపలికి పంపించారు.

మిగతాది 2లో

# సంపాదకీయం

## చంద్రబాబు చేతికి జగన్ జుత్తు!

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఇప్పుడు మహర్దశ నడుస్తున్నట్టుగా ఉంది. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తనను ముప్పుతిప్పలు పెట్టడమే కాకుండా చివరకు జైలుకు కూడా పంపిన జగన్మోహన్‌రెడ్డి జుత్తు మాత్రమే కాదు%-% ఏకంగా పీక ఇప్పుడు చంద్రబాబు చేతికి చిక్కింది. మొదటి నుంచీ డబ్బు పిచ్చి ఉన్న జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత రెచ్చిపోయారు. ఈ క్రమంలో ప్రపంచ కుబేరుడు కావాలన్న దురాశను అణువణువునా నింపుకొన్న గౌతమ్ అదానీతో చేతులు కలిపారు. ఫలితంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలపై 25 ఏళ్లలో దాదాపు రెండు లక్షల కోట్ల రూపాయల అదనపు భారం పడేలా అదానీ గ్రీన్ ఎనర్జీ కంపెనీతో విద్యుత్ కొనుగోలు ఒప్పందం తెర మీదకు వచ్చింది. రెండు రోజుల క్రితం వరకు గుట్టుగా ఉన్న ఈ అతి భారీ కుంభకోణం అమెరికా చట్టాల పుణ్యమా అని వెలుగులోకి వచ్చింది. దీంతో చంద్రబాబు చేతికి పాశుపతాస్త్రం దొరికినట్టయింది. ఒకవైపు రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యతతోపాటు రాజకీయ ప్రత్యర్థి జగన్‌రెడ్డిని రాజకీయంగా దెబ్బతీసే గొప్ప అవకాశం ఈ కేసు వెలుగులోకి రావడంతో చంద్రబాబుకు లభించింది. తండ్రి అధికారంలో ఉన్నప్పుడు అక్రమ సంపాదనకు అలవాటుపడిన జగన్‌రెడ్డి తాను అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా 'నాకేంటి?' అన్న ధోరణిలోనే వ్యవహరించారు. ఫలితంగానే ఈ కేసు జగన్ మెడకు చుట్టుకుంది. 'గతంలో నేను అధికారంలో ఉన్నానా? ఎప్పుడైనా నేను సెక్రటేరియట్‌కు వెళ్లానా?' అని ఫీంకరించిన జగన్‌రెడ్డి ఇప్పుడు కూడా సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ) అనే కేంద్ర ప్రభుత్వ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంటే అవినీతికి పాల్పడ్డానని ఎలా చెప్పగలరని బుకాయించే ప్రయత్నం చేస్తున్నారు. సెకీని అడ్డుపెట్టుకొని అదానీ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నందుకు జగన్‌రెడ్డికి 1750 కోట్ల రూపాయలు లంచంగా వచ్చినట్టు అమెరికా దర్యాప్తు సంస్థలు న్యాయస్థానానికి సమర్పించిన చార్జ్‌షీటులో పేర్కొన్నాయి. తనకు ఏ పాపం తెలియదని జగన్‌రెడ్డి బుకాయించే అవకాశం లేకుండా అమెరికా దర్యాప్తు సంస్థలు ఈ వ్యవహారంలో ఆధారాలు సేకరించాయి. అమెరికాలో ఉంటున్న గౌతమ్ అదానీ ప్రతినిధి సాగర్ అదానీ ఫోన్‌ను అమెరికా దర్యాప్తు అధికారులు స్వాధీనం చేసుకొని విశ్లేషించినప్పుడు ఈ ముడుపుల బాగోతం బయటపడింది. అమెరికాలోని పెట్టుబడిదారుల నుంచి అదానీ గ్రూపు సేకరించిన వేల కోట్ల నిధుల నుంచి దాదాపు 2200 కోట్లను ముడుపుల కోసం మళ్లించారు. భారతదేశంలో ఏయే రాష్ట్రాలలో ఎవరెవరికి ఎంత మొత్తంలో లంచాలు ఇచ్చారనే వివరాలు కూడా సాగర్ అదానీ ఫోన్‌లో లభించాయి. దీంతో ఈ కేసులో తిరుగులేని ఆధారాలు లభించినట్టయింది. ఇప్పుడు ఈ సోలార్ విద్యుత్ కొనుగోలు ఒప్పందం ఎప్పుడు ఎలా జరిగిందో చూద్దాం!

### 'పవర్'ఫుల్ డీల్...

భవిష్యత్ అవసరాల కోసం పది వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలుకు జగన్‌రెడ్డి ప్రభుత్వం 2021లో టెండర్లు పిలిచింది. అంతకు కొద్దిగా ముందు కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీ 12000 మెగావాట్ల సోలార్ విద్యుత్ సరఫరాకు టెండర్లు పిలవగా... యూనిట్ 2.92 రూపాయల వంతున సరఫరా చేయడానికి అదానీ గ్రీన్ ఎనర్జీ, అజూర్ పవర్ ఎనర్జీ లిమిటెడ్ టెండర్లు దాఖలు చేసి దక్కించుకున్నాయి. తాము ఒప్పందాలు కుదుర్చుకున్న కంపెనీలు సరఫరా చేసే విద్యుత్‌ను ఆయా రాష్ట్రాలకు సరఫరా చేసి ఏడు శాతం కమీషన్లు తీసుకోవడం వరకే సెకీ పాత్ర పరిమితం. అంటే, ప్రైవేటు సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య కేంద్ర సంస్థ అనుసంధానకర్తగా వ్యవహరిస్తుందన్న మాట! అదానీ, అజూర్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్న సెకీద్వారా యూనిట్ 2.92 రూపాయల వంతున విద్యుత్ కొనుగోలు చేయడానికి ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ముందుకు రాలేదు. ఇదే సమయంలో రాజస్థాన్‌లో ఉత్పత్తి అయిన సోలార్ పవర్‌ను యూనిట్‌కు 1.99 పైసలకే గుజరాత్‌కు విక్రయించారు. దీంతో భవిష్యత్తులో సోలార్ విద్యుత్ ధరలు పడిపోతాయని భావించిన గౌతమ్ అదానీ రంగప్రవేశం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని కలిశారు. ఆ వెంటనే సెకీ సంస్థ రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శికి లేఖ రాసింది. అదానీ, అజూర్ కంపెనీలతో 2.92 రూపాయలకు కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ యూనిట్ 2 రూపాయల 49 పైసలకే సరఫరా చేస్తామని సెకీ ఆఫర్ ఇచ్చింది. అంతకు ముందే అప్పటి ముఖ్యమంత్రితో అదానీ సమావేశం జరగడంతో రాష్ట్ర ప్రభుత్వం పది వేల మెగావాట్ల విద్యుత్ కోసం పిలిచిన టెండర్లను రద్దు చేసుకుంది. ఇదంతా రహస్యంగా జరిగిపోయింది. ఇప్పుడు సెకీతో ఒప్పందం కుదుర్చుకుంటే కుంభకోణం జరిగిందని ఎలా చెబుతారు? అని ఎవరైనా ప్రశ్నించవచ్చు. గతంలో నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్(ఎన్బీసీసీ) అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ ఉండేది. పోటీ లేకుండా పనులు దక్కించుకోవాలనే కంపెనీలు ఎన్బీసీసీని కవచంగా వాడుకునేవి. పనులను ముందుగా ఎన్బీసీసీకి నామినేషన్‌పై కట్టబెట్టేవారు. ఆ తర్వాత ఎన్బీసీసీ నుంచి బ్యాక్ టు బ్యాక్ ఒప్పందం కింద డీల్ కుదుర్చుకున్న కంపెనీలు పనులు పొందేవి. చివరికి ఇదొక ప్రహసనంగా మారడంతో ఎన్బీసీసీ ఉనికిలో లేకుండా పోయింది. ఇప్పుడు సోలార్ విద్యుత్ ప్రమోషన్ పేరిట ఏర్పాటైన సెకీ కూడా ఎన్బీసీసీ బాపతే. ఇదొక కమీషన్ ఏజెంట్ పాత్ర పోషిస్తోంది. ఇప్పుడు అదానీతో కుదుర్చుకున్న ఒప్పందంలో నిబంధనల ఉల్లంఘన ఎలా జరిగిందో, రాష్ట్ర ప్రజలపై రెండు మూడు లక్షల కోట్ల రూపాయల వరకు అదనపు భారం ఎలా పడబోతున్నదో చూద్దాం!

### ధరల షాకు ప్రజలకే!

అదానీతో రహస్య అవగాహన కుదిరిన తర్వాత అప్పటికే పిలిచిన పదివేల మెగావాట్ల టెండర్లను రద్దు చేసుకున్న జగన్‌రెడ్డి ప్రభుత్వం సెకీ ద్వారా అదానీ నుంచి 12000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అదానీ కంపెనీతో యూనిట్‌కు 2.92 రూపాయలు చెల్లించడానికి ఒప్పందం కుదుర్చుకున్న సెకీ రాష్ట్ర ప్రభుత్వానికి యూనిట్ 2.49 రూపాయలకే సరఫరా చేయడానికి ఆఫర్ ఇవ్వడం గమనార్హం. మొత్తానికి యూనిట్‌కు 2.49 రూపాయల వంతున చెల్లించే విధంగా రూపొందించిన ప్రతిపాదనలను జగన్ మంత్రి మండలి ఆమోదించింది. ఆ సమయంలోనే కేంద్రంతోపాటు వివిధ రాష్ట్రాలు కుదుర్చుకున్న సౌర, పవన విద్యుత్ ఒప్పందాల ధర రెండు రూపాయల 30 పైసల నుంచి రెండు రూపాయల 40 పైసల వరకు ఉండింది. అయినా పెద్ద తేడా లేదు కదా అని సరిపెట్టుకుందాం! మంత్రివర్గం ఆమోదించిన ధర ఒకటి కాగా సెకీ ద్వారా అదానీ కంపెనీకి చెల్లించాల్సిన ధర మరో విధంగా పీపీఏ కుదుర్చుకున్నారు. ఇందుకు మంత్రిమండలి ఆమోదం లేదు. మంత్రి మండలి ఆమోదించిన దానికి భిన్నంగా అంతర్ రాష్ట్ర పంపిణీ చార్జీలు, అంతర్ రాష్ట్ర నష్టాల రూపంలో అదనపు చార్జీలు చెల్లించడానికి పీపీఏలు కుదుర్చుకున్నారు. ముందుగా 7000 మెగావాట్లకు అదానీతో పీపీఏ కుదుర్చుకున్నారు. అంతర్ రాష్ట్ర పంపిణీ చార్జీల రూపంలో ఒక యూనిట్‌కు రెండు రూపాయల 21 పైసలు చెల్లించడానికి పీపీఏ కుదుర్చుకున్నారు. దీంతో యూనిట్‌కు ధర 4 రూపాయల 70 పైసలు అయింది.

# యాచకులకు డబ్బులిస్తే కేసులే!

**భిక్షాటనను నిషేధించిన జిల్లా అధికారులు.. యాచకులకు సాయం చేసే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.**



యాచకులు లేని నగరంగా తీర్చిదిద్దేందుకు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరం అనేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే భిక్షాటనను నిషేధించిన జిల్లా అధికారులు.. యాచకులకు సాయం చేసే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భిక్షాటన చేసేవారికి డబ్బులిచ్చేవారిపైనా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తామని ప్రకటించారు. జనవరి 1, 2025 నుంచి ఈ నిబంధనలు అమలు చేస్తామని చెప్పారు.

"నగరాన్ని యాచకులులేని ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అనేక చర్యలు చేపడుతున్నాం. ఇందులో భాగంగా డిసెంబర్ చివరి వరకు వీటిపై అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తాం. జనవరి 1 నుంచి యాచకులకు ఎవరైనా డబ్బులు ఇస్తున్నట్లు కనిపిస్తే వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తాం" అని ఇండోర్ కలెక్టర్ ఆశిశ్ సింగ్ హెచ్చరించారు. భిక్షాటన చేస్తున్న వారికి ఎటువంటి సాయం చేయొద్దని, వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని విజ్ఞప్తి చేశారు.

యాచకులు లేని నగరాలను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర సామాజిక న్యాయ, సాధికార మంత్రిత్వ శాఖ.. 10 నగరాల్లో పైలట్ ప్రాజెక్టు చేపట్టింది. దిల్లీ, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ సహా పలు నగరాలు ఈ జాబితాలో ఉన్నాయి. ఇందులో భాగంగా భిక్షాటన కార్యకలాపాలపై దృష్టి సారించిన ఇండోర్ అధికారులు ఆశ్చర్యకరమైన విషయాలు గుర్తించారు. కొందరికి పక్కా ఇళ్లు ఉన్నాయని, మరికొందరి పిల్లలు ఉద్యోగాలు కూడా చేస్తున్నట్లు తెలుసుకున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి ప్రత్యేకంగా వచ్చిన కొన్ని ముఠాలు అనేక మందిని యాచక వృత్తిలో దించుతున్నట్లు తెలిసిందని ప్రాజెక్టు ఆఫీసర్ దినేశ్ మిశ్రా పేర్కొన్నారు. ఇటువంటి అసాంఘీక చర్యలకు తావులేకుండా ఉండేందుకు చర్యలు చేపట్టామని.. భిక్షాటన చేసే వారిని గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నామని చెప్పారు.

ఇదిలాఉంటే, దేశంలోనే అత్యంత పరిశుభ్ర నగరాల జాబితాలో ఇండోర్ కొంతకాలంగా అగ్రస్థానంలో నిలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించే స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులను వరుసగా కైవసం చేసుకుంటోంది. పరిశుభ్రతలోనే కాకుండా యాచకులు లేని నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

# జాకిర్ హుస్సేన్ 'వాహ్ తాజ్' కథ ఇదే..



1990ల్లో వచ్చిన 'వాహ్ తాజ్' ప్రకటనతో ఇంటింటికీ చేరువయ్యారు తబలా మైస్ట్రో జాకిర్ హుస్సేన్. మరి ఈ యాడ్ వెనక స్టోరీ తెలుసా?

తబలా మైస్ట్రో జాకిర్ హుస్సేన్.. ఆరు దశాబ్దాల తన సుదీర్ఘ సంగీత ప్రయాణంలో ఎంతోమంది సంగీతప్రియులకు ఆరాధ్యనీయుడైన విద్వాంసుడు. శాస్త్రీయ సంప్రదాయాలను ప్రపంచ సంగీతంతో మిళితం చేసి సాంస్కృతిక ఐక్యతకు చిహ్నంగా నిలిచిన కళాకారుడు. అయితే, చాలామందికి జాకిర్ హుస్సేన్ (%ఘుఎఅతీ ఎబంయిఖఅఅ%) అనగానే చటుక్కున గుర్తుకొచ్చే మరో పదం 'వాహ్ తాజ్ '. దీంతో ఆయన సంగీతప్రియులకే కాకుండా యావత్ దేశంలోని ప్రతీ ఇంటికీ చేరువయ్యారు. అదే 1990ల్లో ఆయన నటించిన తాజ్‌మహల్ టీ ప్రకటన. అసలీ యాడ్ వెనక స్టోరీ ఏంటీ? దీని గురించి ఆయన ఏమన్నారు? ఓసారి గుర్తుచేసుకుందాం..!

**వాహ్ తాజ్ అనాలి..**

జాకిర్ హుస్సేన్ తబలా వాయిస్తుంటే ఆహ్లాదంగా ఉంటుందంటారు సంగీతప్రియులు. వర్షపు చినుకుల సవ్వడి నుంచి పరమశివుడి ఢమరుకం ధ్వని వరకు ప్రతి శబ్దాన్ని తన తబలాపై ఆయన పునఃసృష్టి చేసేవారు. అందుకే ఆయన ప్రదర్శనను తిలకించే వీక్షకులంతా 'వాహ్ ఉస్తాద్' అంటూ కొనియాడేవారు. దీన్ని ఆధారంగా చేసుకొనే హిందుస్థాన్ థాంప్సన్ అసోసియేట్స్ కంపెనీ ఓ యాడ్ రూపొందించింది. అదే 'తాజ్ మహల్ టీ' ప్రకటన.

ఇందులో ఆగ్రాలోని ప్రఖ్యాత కట్టడం తాజ్‌మహల్ ముందు జాకిర్ హుస్సేన్ కూర్చుని తబలా వాయిస్తుంటారు. తన కళను ఉత్తమంగా తీర్చిదిద్దుకునేందుకు సాధన చేస్తుంటారు. అప్పుడే ఈ టీని కూడా ఉత్తమంగా అందించేందుకు ఎన్నో రకాల నాణ్యతా పరీక్షలు చేశాం – అంటూ బ్యాక్‌గ్రౌండ్‌లో వాయిస్ వినిపిస్తుంటుంది. వీడియోలో చివరగా ఆయన వాయిద్యానికి మైమర్చిపోయిన ఓ అమ్మాయి జాకిర్‌కు ఓ కప్పు టీ అందిస్తూ 'వాహ్ ఉస్తాద్' అని అంటుంది. దానికి ఆయన బదులిస్తూ 'వాహ్ ఉస్తాద్ కాదు.. వాహ్ తాజ్ అనండి' అని అంటారు.

మరో యాడ్‌లో ఓ బాలుడితో కలిసి తబలా వాయిస్తూ ఉంటారు. బాలుడి ప్రతిభను మెచ్చి జాకిర్ 'వాహ్ ఉస్తాద్' అంటారు. దీనికి ఆ బాలుడు 'అరె హుజూర్, వాహ్ ఉస్తాద్ కాదు.. వాహ్ తాజ్ అనాలి' అనడంతో వారిద్దరూ నవ్వులు చిందిస్తారు. ఈ యాడ్ అప్పటికీ, ఇప్పటికీ ప్రత్యేకమే!

**సొంత ఖర్చులతో ఆగ్రాకు వచ్చి..**

1966లో ఈ తాజ్‌మహల్ టీని కంపెనీ కోల్‌కతాలో ప్రారంభించింది. తొలుత దీని ప్రచారం కోసం జాకిర్ హుస్సేన్‌ను అనుకోలేదట. నటీనటులు జీనత్ అమన్, మాళవిక తివారీ వంటి వారు దానిలో కన్పించారు. అయితే అప్పట్లో కేఎస్ చక్రవర్తి అనే వ్యక్తి హిందుస్థాన్ థాంప్సన్ అసోసియేట్స్‌లో కాపీరైటర్‌గా పని చేసేవారు. ఆయనకు తబలా అంటే చాలా ఇష్టం. ఓసారి జాకిర్ హుస్సేన్ ప్రదర్శనను తిలకిస్తుంటే.. తమ టీ యాడ్‌కు ఆయన సరిగ్గా సరిపోతారని అనిపించిందట. అదే విషయాన్ని యాజమాన్యానికి చెప్పగా వారు జాకిర్‌ను సంప్రదించారు. ఈ యాడ్ కాన్సెప్ట్ ఆయనకూ నచ్చడంతో సొంత ఖర్చులతో శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి ఆగ్రాకు వచ్చినట్లు అప్పట్లో కథనాలు వచ్చాయి.

**కనిపించింది 30 సెకన్లే అయినా..**

ఈ ప్రకటనలో నటించడం గురించి గతంలో జాకిర్ హుస్సేన్ ఓ ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. "నా పేరు వినగానే 'వాహ్ తాజ్' అని చాలామంది చెబుతారు. సాధారణంగా బాలీవుడ్ మ్యూజిక్‌తో పోలిస్తే శాస్త్రీయ సంగీతానికి ఆదరణ కాస్త తక్కువే. శాస్త్రీయ కళాకారులను కూడా అంతగా ఎవరూ గుర్తుపెట్టుకోరు. ప్రజలకు చేరువయ్యేందుకు మాలాంటి వారికి ఏదో ఒక వేదిక కావాలి. 'తాజ్ టీ' నాకు అలాగే ఉపయోగపడింది. ఆ యాడ్‌లో నేను కన్పించింది 30 సెకన్లే అయినా.. నన్ను చాలామంది గుర్తుపట్టేలా చేసింది. నేను ఎవరనే ఆసక్తిని మరింత పెంచింది" అని జాకిర్ నాడు చెప్పారు.

# కుటుంబం కోసం రాజ్యాంగాన్ని మార్చివేశారు: కాంగ్రెస్‌పై సీతారామన్ విమర్శలు

రాజ్యసభలో జరుగుతోన్న ప్రత్యేక చర్చలో భాగంగా కాంగ్రెస్‌పై కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ తీవ్ర విమర్శలు చేశారు.



దిల్లీ: భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకొని 75వ ఏడాదిలోకి అడుగుపెట్టిన సందర్భంగా రాజ్యసభలో సోమవారం ప్రత్యేక చర్చ జరుగుతోంది. అధికార పక్షం తరపున కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ చర్చను ప్రారంభించారు. ఈసందర్భంగా కాంగ్రెస్‌పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. కుటుంబం కోసం రాజ్యాంగాన్నే మార్చివేశారని దుయ్యబట్టారు.

"రెండో ప్రపంచయుద్ధం తర్వాత దాదాపు 50 దేశాలకు స్వాతంత్ర్యం లభించింది. అవి రాజ్యాంగాన్ని రచించుకున్నాయి. కాలక్రమంలో పలు దేశాలు తమ రాజ్యాంగం అసలు ఉద్దేశాన్ని మార్చివేశాయి. కానీ మన రాజ్యాంగం మాత్రం కాలపరీక్షలను తట్టుకొని నిలబడింది. వాక్ స్వాతంత్ర్యాన్ని అణచివేసేందుకు కాంగ్రెస్ సవరణలు చేసింది. ఇప్పుడు మాత్రం రాజ్యాంగ పరిరక్షణ గురించి ప్రసంగాలు చేస్తోంది" అని సీతారామన్ మండిపడ్డారు.

నా ఎదుగుదలకు, పతనానికి గాంధీ కుటుంబమే కారణం ఇందిర హయాంలో విధించిన ఎమర్జెన్సీ, 42వ రాజ్యాంగ సవరణ గురించి ఆమె ప్రస్తావించారు. "కాంగ్రెస్ చేసిన సవరణలు రాజ్యాంగం బలోపేతానికి కాదు. అధికారంలో ఉన్నవారిని రక్షించుకోవడానికి.. కుటుంబం కోసం ఈ ప్రక్రియను ఉపయోగించారు" అని వ్యాఖ్యలు చేశారు. ఇందిర అధికారంలో ఉన్నప్పుడు రాజ్యాంగాన్ని నిలిపివేయాలని ప్రయత్నించారని భాజపా చీఫ్, కేంద్రమంత్రి జేపీ నడ్డా విమర్శించారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నుంచి అభ్యంతరం వ్యక్తమైంది.

## బీఏసీ సమావేశం నుంచి భారాస, ఎంఐఎం వాకౌట్

మొదటిపేజీ తరువాయి

సభ ఎన్నిరోజులు నడుపుతారో చెప్పడం లేదంటూ భారాస నేతలు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ సమావేశం నుంచి వాకౌట్ చేశారు.

" సభను కనీసం 15 రోజుల పాటు నడపాలని కోరాం. ప్రభుత్వం మాత్రం 3 లేదా 4 రోజులు నడుపుతామని చెబుతోంది. ఇటీవల సమావేశాలకు టీ షర్టులతో వస్తే ఎందుకు అడ్డుకున్నారని నిలదీశాం. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ టీషర్టుతో పార్లమెంట్‌కు వెళ్లడం లేదా?" అని హరీశ్ ప్రశ్నించారు. బీఏసీ లేకుండానే బిల్లులు పెట్టడం సంప్రదాయ విరుద్ధమని హరీశ్ విమర్శించారు.

## పురుటి నొప్పులతోనే గ్రూప్-2 పరీక్ష రాసి..!

మొదటిపేజీ తరువాయి

పరీక్ష రాస్తానని చెప్పారు. ఆమె కాన్పు తేదీ ఇవాళే కావడంతో అందరూ కాస్త ఆందోళనకు గురయ్యారు.

అయినా, ఆమె పట్టు వదలకుండా పరీక్ష రాస్తానని చెప్పడంతో.. అధికారులు ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ సంతోష్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం.. పరీక్ష కేంద్రంలో 108 అత్యవసర వాహనాన్ని అందుబాటులో ఉంచారు. ప్రత్యేక వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఆమెకు ఎప్పుడు తీవ్ర నొప్పులు వచ్చినా.. ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు అన్నీ సిద్ధంగా ఉంచారు. రేవతి భర్త, ఆమె తల్లి అందుబాటులో ఉన్నారు.

**లగచర్ల రైతులకు న్యాయం జరిగే దాకా పోరాడతాం..**

## అధైర్యపడొద్దు : కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ అసెంబ్లీలో అరాచక, దుర్మార్గమైన ప్రభుత్వం తీరును ప్రజలు గమనిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. భూములు ఇవ్వని పాపానికి దళిత, బలహీనవర్గాల రైతులను జైల్లో పెట్టారని మండిపడ్డారు. భూములు ఇవ్వమన్న రైతులపై కేసులు పెట్టడమే కాకుండా థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## గురుకులాల ఏర్పాటులో నిర్లక్ష్యం.. కాంగ్రెస్ సర్కార్‌పై మండిపడ్డ ఎమ్మెల్సీ కవిత

మొదటిపేజీ తరువాయి

కేసీఆర్ హయాంలో 2230 బీసీ విద్యార్థులకు విదేశీ విద్య కింద రూ. 450 కోట్లు ఖర్చు చేశామని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం విదేశీ విద్యకు ఎలాంటి ప్రోత్సహకాలు అందించలేదని చెప్పారు. ఎందుకు ఇంత ఆలస్యమవుతుందని కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీశారు. గురుకులాల్లో మెనూ మార్చామని చెబుతున్నారని.. కానీ ఇంకా స్కూల్స్‌లో ప్రారంభించలేదని అన్నారు. కొత్త మెనూను ఎప్పటి నుంచి ప్రారంభిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి అయ్యాక రేవంత్ రెడ్డి నెలకు రెండు మూడు సార్లు ఢిల్లీకి వెళ్లారని కవిత అన్నారు. ఢిల్లీకి వెళ్లి కేంద్రమంత్రులను కలిసిన రేవంత్ రెడ్డి.. జిల్లాకొకటి రావాల్సిన నవోదయ విద్యాలయాలను ఎన్ని సాధించారని ప్రశ్నించారు. వెనుకబడిన జిల్లాలకు నిధులు సాధించారా అని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వంతో సఖ్యతగా ఉంటూ అదనంగా ఎన్ని నిధులు తీసుకొచ్చారని ప్రశ్నించారు.

## ప్రజా సమస్యల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం పారిపోతుంది.. జగదీశ్ రెడ్డి ధ్వజం



మొదటిపేజీ తరువాయి

అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సోమవారం జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై నిప్పులు చెరిగారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి సమయం ఇవ్వాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెప్పారని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ మాత్రం అధికారంలోకి వచ్చిన రోజు నుంచే ప్రజలపై పడిందని విమర్శించారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చివేసిందని మండిపడ్డారు. మూసీ సుందరీకరణ పేరుతో బడాబాబులకు దోచిపెట్టే కుట్రకు తెరతీసిందని ఆరోపించారు. లగచర్ల రైతులపై ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తోందని తెలిపారు. జైలులో ఉన్న లగచర్ల గిరిజన రైతులపై ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుండెపోటు వచ్చిన రైతుకు బేడీలు వేసి ఆస్పత్రికి తీసుకెళ్లారని అన్నారు. లగచర్ల ఘటనపై చర్చకు కోరితే ప్రభుత్వం పారిపోయిందని తెలిపారు.

అసెంబ్లీ స్పీకర్ రాష్ట్ర ప్రభుత్వంలో భాగం కాదన్న విషయం గుర్తించాలని జగదీశ్ రెడ్డి సూచించారు. స్పీకర్ మా నోరు నొక్కుతున్నారని తిట్లు తిట్టేవారికే అవకాశం కల్పిస్తున్నారని ధ్వజమెత్తారు. లగచర్ల రైతుల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తిపై ప్రభుత్వం కాకి లెక్కలు చెబుతోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలన నుంచి పారిపోతోందని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ఎండగడుతూనే ఉంటామని స్పష్టం చేశారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం డిసెంబర్ 17 2024

## కమ్యూనిస్టులు,సెక్యులరిస్టులు, సూడో అంబేద్కరిస్టులు

# వోకిజం మానసిక వ్యాధి పీడితులు

శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్

**వోకిజం అంటే ఏమిటి?**
**ఇంగ్లీష్ లో వేకప్ మీరు విని ఉంటారు.**
**వేక్ యొక్క పాస్ట్ టెన్స్ వోక్. వోక్ నిజమైన అర్థం మేల్కోవడం లేదా జాగృతం కావడం.**
**వోకిజం అంటే జాగృతమవ్వడం అని నిర్వచించవచ్చు.**




వోకిజమ్ కు అధికారిక నిర్వచనం లేదు.అయితే, ఆఫ్రికన్ అమెరికా కమ్యూనిటీ జాతుల వాళ్ళు తమలో తాము చర్చించుకునే విషయం, భావం వోకిజం గా రూపాంతరం చెందింది.తమను తాము ప్రజాస్వామ్యవాదిగా,అభ్యుదయ వాదిగా, మంచి వ్యక్తిగా భావించడం వోకిజం అని చెప్పుకోవచ్చు. ఈ వోకిజం కమ్యూనిజం యొక్క కొత్త అవతారం.మార్క్స్, లెనిన్,స్టాలిన్, ట్రూడో, పోల్ పాట్, బైడెన్, మావో..ఇలా అందరూ మానవాళికి 'రక్షకులు' అని మాత్రమే విశ్వసించడం వోకిజం.'జ్ఞానం లేని ప్రజానీకాన్ని' సరైన దారిలో నడిపిస్తాం అని వోకిజం తో ప్రభావితం అయినవారు భావిస్తారు.అణచివేతకు వ్యతిరేకంగా ప్రజలందరినీ మేల్కొలుపుతూ నియంత్రించడం, ప్రజల ఆలోచనను నియంత్రించడం వోకిజం గా చెప్పుకుంటూ, నాన్ స్టాప్ కల్పిత వార్తలతో ప్రచారం చెయ్యడం వోకిజం.ఈ వోకిజం బారిన పడ్డ వాళ్ళు తమ దేశాన్ని,సంస్కృతిని, ఆచార వ్యవహారాలను కించపరుచుకుంటూ బతుకుతారు.వోకిజం ఒక రకమైన కమ్యూనిస్టు రూపం.ఈ వోకిజం జబ్బు ఉదారవాద రూపంలో మన భారత్ లో కూడా గత కొన్ని సం.లుగా బాక్టీరియా, వైరస్ లాగా కొందరికి సోకింది.వీళ్ళు ఎవ్వరి మాటా వినరు. నిజం తెలుసుకోరు. తాము నమ్మింది నిజం అని నమ్ముతూ హేతు రహితంగా వాదిస్తారు.ఈ జబ్బు సోకినవారు మనకు సోషల్ మీడియాలో ఇప్పుడు దర్శనమిస్తున్నారు.భారత సంస్కృతి చెడ్డదని, భారత దేశ విలువలు పనికిరానివని గుడ్డిగా ప్రచారం చేస్తుంటారు. నిజా నిజాలు వీరికి అవసరం లేదు. ఎదుటి వారు చెప్పినా పట్టించుకోరు.కన్జర్వేటివ్ ఎ డిస్కవరీ అనే పుస్తకంలో "యోరాం రూబెన్ హాజోని" అనే ఇజ్రాయిలీ అమెరికన్ వోకిజం కమ్యూనిజం మధ్యన సంబంధాన్ని వివరించాడు.క్రానికల్స్ పత్రికలో "పాల్ గాట్ ఫ్రైడ్" అనే అమెరికా రచయిత, చరిత్ర కారుడు, వోకిజం కమ్యూనిజం మధ్యన సారూప్యతను సోదాహరణంగా వివరించారు.ఈ జాగృత భావన అనే వోక్ చర్చను అమెరికా డీప్ స్టేట్ హైజాక్ చేసింది.నిజం ఇదని ప్రచారం చేసే మానసిక బానిసలుగా కొందరిని ఒక గుంపు గా వాసుకుంటున్నది.ఈ వోకిజం కు బ్రాండ్ అంబాసిడర్ గా రాహుల్ గాంధీ వ్యవహరిస్తున్నాడని విమర్శకులు ఇప్పుడు నిజ నిర్ధారణ చేస్తున్నారు.భారత దేశంలో వెర్రి తలలెత్తిన బూటకపు సిద్ధాంతాల భక్తులు గుడ్డిగా ఈ అబద్ధపు ప్రవాహంలో కొట్టుకుపోతున్నారు. హిందుత్వం లో అంటరానితనం ఉందని, మనుస్మృతి వాదం వల్ల భారత దేశాన్ని ఆదిమ కాలంలోకి తీసుకెళ్తున్నారని, పెట్టుబడి దారులకు దేశాన్ని అమ్మేస్తున్నారని ఎడతెగని ప్రచారం చెయ్యడం ఈ వోకిజం లో భాగం.వీరిది అబద్ధపు వార్తా ప్రపంచం. నిజం తెలియని సామాన్య ప్రజలను ఉన్మాదం వైపు నెట్టడం వీరి పని.ఈ వోకిజం రోగ పీడితులు సమాజ విచ్ఛిన్న కార్యక్రమంలో మునిగి తేలుతారు.ఈ రోగం సోకిన విషయం కూడా తెలియని కొంతమంది భారత వ్యతిరేక శక్తులుగా మారి ఊక దంపుడు వాదనలు చేస్తుంటారు.ఈ మధ్యన ఈ వోకిజం పీడితులు అంబేద్కర్ పేరుతో రాజ్యాంగ వ్యతిరేక శక్తులకు పనిముట్లుగా మారి సోషల్ మీడియాలో పొంతన లేని పోస్టులు పెడుతున్నారు.ఉదార వాదంగా, అభ్యుదయ వాదంగా కనిపించే ఈ వోకిజం మాయ లేడి లాంటిది.బంగారు జింకగా కనిపించే వోకిజం ఒక మాయా రాక్షస రూపం.దేశం పట్ల ప్రేమ లేని విదేశీ తొత్తులు ఈ ప్రచారంలో ముందున్నారని నన్నపనేని రాజశేఖర్ గారు ఈ వోకిజం నిజ రూపాన్ని సోదాహరణంగా వివరిస్తున్నారు.సంస్కృతీ సంప్రదాయాలు, అబద్ధపు కథనాల మధ్య భారత ప్రజలను నెట్టి వేయాలని ఈ వోకిజం ప్రభావిత వ్యక్తులు పాపం భారత అంధ విరోధులుగా మారి పోయారని రాజశేఖర్ గారు ప్రజా చైతన్యానికి కృషి చేస్తున్నారు.ఈ వోకిజం లో ముఖ్యంగా మనకు కనిపించేది కమ్యూనిస్టులు, సెక్యులర్ వ్యాధి గ్రస్థ ముఠాలు, కుహనా అంబేద్కర్ వాదులు.ఈ కుట్రలన్నీ ఛేదించే సహజ తెలివి భారతీయుల సొత్తు. భారత్ సిరియా కాదు,పాకిస్తాన్ కాదు,యుక్రెయిన్ కాదు,బంగ్లాదేశ్ లాంటి దేశం కాదు.భారత జాతి అలసి పోయింది కాని స్మృతి కోల్పోలేదు.తాత్విక ధోరణి ఈ జాతి సుగుణం.వెయ్యేళ్ళ పరాయి పాలనలో భారత జాతి అలవికాని అరాచకాలను ఎదుర్కొన్నది. అణచివేతకు గురయ్యింది. అలసి సొలసి విశ్రాంతి తీసుకున్నది.ఇప్పుడు భారత జాతి మేల్కొన్నది.జాగృత భారతం ఈ వోకిజం లాంటి ఆలోచనా ధోరణులను "వాతాపి జీర్ణం" అంటూ స్వాహా చేసే శక్తి కలది.జీసస్ మాటల్లో చెప్పాలంటే"తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని" లూకా 23,24 లో ప్రకటిస్తాడు.అబద్ధ ప్రచారంలో మునిగి పోయిన ఈ వోకిజం రోగ పీడితులను ఆ ప్రభువు క్షమించినా భారతీయులు ఇక క్షమించరు.అమెరికా డీప్ స్టేట్ ఈ వోకిజం ను రెజిం చేంజ్ కుట్రలకు ఒక ఆయుధంగా వాడుకుంటున్నది.4 దశాబ్దాల క్రితం అమెరికాను సామ్రాజ్య వాద దేశంగా ప్రచారం చేసిన కమ్యూనిస్టులు, గోడల మీద వ్రాసిన అతివాద కమ్యూనిస్టులు ఇప్పుడు అదే అమెరికాకు పావులుగా మారిపోయారు.ఈ వోకిజం ప్రభావిత వ్యక్తులు తమకు తెలియకుండానే భారత వ్యతిరేక శక్తుల ఆయుధంగా మారిపోయారు.గమనించండి మీ వాట్సప్ గ్రూపుల్లో, ఇన్స్ స్టా గ్రాంలో, ఫేస్ బుక్ లో ఈ అమాయక జీవులు ఫార్వర్డ్ పోస్టులు పెడుతుంటారు.క్రీస్తు చెప్పిన క్షమా గుణం వదిలి, కృష్ణుడు చెప్పిన దుష్ట శిక్షణ కార్యం అమలు చెయ్యాలని ఇప్పుడు భారతీయులు ఎక్కడికక్కడ ధర్మ యుద్ధం ప్రారంభించారు.ఈ వోకిజం గురించి మరొక్కసారి మరింత విస్తారంగా చర్చించుకుందాం.

సత్యమే జయిస్తుంది.

## లోక్ అదాలత్ లో 513 కేసులు పరిష్కారం

**కరపత్రం బాన్సువాడ, డిసెంబర్ 16**

బాన్సువాడ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 513 సివిల్, క్రిమినల్ కేసులకు పరిష్కారం చేసినట్లు జడ్జి టిఎస్పి భార్గవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీమార్గమే రాజ మార్గం అని కేసులు నమోదు చేసుకోవడం ద్వారా డబ్బుతోపాటు సమయం వృధా అవుతుందని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చట్టాన్ని ఎవరు చేతిలోకి తీసుకున్న న్యాయ పరిధిలో శిక్షింపబడతారన్నారు.

## జిల్లాస్థాయి సీఎం కప్ కుస్తీ పోటీలను ప్రారంభించిన కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్

– క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం.. కార్పొరేషన్ చైర్మన్

**కరపత్రం బాన్సువాడ, డిసెంబర్ 16**




బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం జిల్లా స్థాయి సీఎం కప్ కుస్తీ పోటీలను రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో ముఖ్యమని భావించి క్రీడాకారులకు మెరుగైన వసతులు సౌకర్యాలు కల్పించడానికి 200 కోట్లు బడ్జెట్లో కల్పించడం జరిగిందన్నారు. గ్రామీణ స్థాయి క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడి జాతీయ అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పిడి వెంకట్, మున్నూరు కాపు సంఘ నాయకులు మామిండ్ల అంజయ్య, ఆకుల శ్రీనివాస్, పీఈటీలు కాశిరాం, అనిల్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు.. కోర్ట్ జడ్జి టిఎస్పి భార్గవి


**కరపత్రం బాన్సువాడ, డిసెంబర్ 16**
మత్తు పదార్థాలకు బానిసై యువత ప్రజలు తమ అందమైన జీవితాన్ని భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కోర్ట్ జడ్జి టిఎస్పి భార్గవి అన్నారు. శనివారం బాన్సువాడ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాలు, మద్యానికి బానిసవ్వడం వల్ల అనారోగ్యానికి గురికావడమే కాకుండా తమ కుటుంబాలను నష్టపరిచిన వారవుతారని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ మండల అశోక్, రూరల్ సీఐ రాజేష్, న్యాయవాదులు రమాకాంత్ రావు, ఖలీల్, మొగులయ్య, అజీమ్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## మున్నూరు కాపులు సామాజికంగా రాజకీయంగా ఎదగాలి.. కార్పొరేషన్ చైర్మన్ కాసుల





**కరపత్రం బిచ్కుంద, డిసెంబర్ 16**
మున్నూరు కాపులు రాజకీయంగా సామాజికంగా సమాజంలో ఉన్నత స్థానానికి ఎదిగి తమకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకోవాలని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు సోమవారం బిచ్కుంద మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘ భవనంలో నిర్వహించిన మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనానికి రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నూరు కాపులు వ్యవసాయాన్ని నమ్ముకుని జీవిస్తూ ఇతరులకు సాయం చేసే గుణం ఉన్న గొప్ప మనసున్న మున్నూరు కాపులన్నారు. మున్నూరు కాపులు విద్యాపరంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని సమాజంలో తమకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకోవాలన్నారు. మున్నూరు కాపు పేద విద్యార్థుల కోసం మనమందరం ఐక్యమత్యంతో ఉండి వారిని విద్యారంగంలో మరింత ముందుకు



తీసుకువెళ్దామన్నారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజును మున్నూరు కాపులు శాలువా జ్ఞాపకతో ఘనంగా సత్కరించారు..ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు రాష్ట్ర నాయకులు మామిండ్ల అంజయ్య, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ దఫెదర్ రాజు,జిల్లా అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్ , ఉగ్గె శ్రీనివాస్,బండివార్ విజయ్, ప్రదీప్ పటేల్, అస్పత్వార్ వినోద్, యూత్ జిల్లా అధ్యక్షులు కాసుల రోహిత్,మాజీ జడ్పీటీసీ రాజు,నాగనాథ్, విజయ్, సోపాన్,తదితరులు నాయకులూ పాల్గొన్నారు

## గ్రామ పంచాయతీ కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలి

**కరపత్రం నిజామాబాద్ టౌన్,డిసెంబర్ 16 :**
తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్(టీయూసీఐ)ఆధ్వర్యంలో నిజామాబాద్ రూరల్ ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి,ఎంపీడీవో కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు మామిడాల వెంకటి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీలలో సుమారు 60 వేల మంది మల్టీపర్పస్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న జీపీ కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెరుగుతున్నా ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగడం లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, జీవో 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని రెండవ పిఆర్సి లో కార్మికులను చేర్చి



వేతనాలు ఇవ్వాలని,ప్రతినెల మొదటి తేదీన జీతాలు ఇవ్వడానికి ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించాలని,గ్రీన్ ఛానల్ ద్వారా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ప్రకారం గ్రామపంచాయతీ వర్కర్ల మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని,కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. ఇందిరమ్మ గృహాలు,డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో జీపీ కార్మికులకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రతి నెల శానిటేషన్ వస్తువులు,భద్రతా పరికరాలు ఇవ్వాలన్నారు. రోజుకు 8 గంటలే పని చేయించాలన్నారు. ప్రతి ఆదివారం సెలవు ఇవ్వాలని,పంచాయతీ సెక్రెటరీ,సర్పంచుల వేధింపులు ఆపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిచో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామపంచాయతీ కార్మికులు జేఏసీ నిర్ణయం మేరకు ఉద్యమ బాట పడతారని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎఐపీకెఎంఎస్,జిల్లా అధ్యక్షులు సిహెచ్ సాయన్న,జీపీ కార్మికులు అబ్దుల్,నరసయ్య,మధు ,లచ్చన్న, ఓడ్డన్న,పోసాని,తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
మంగళవారం డిసెంబర్ 17 2024

# తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్న కాంగ్రెస్ సర్కార్...

- పేర్లు..రూపాలను మార్చడంపైనే సీఎం రేవంత్ దృష్టి
- రామగిరి గడ్డపైనే త్వరలో తెలంగాణ వీరవనిత విగ్రహం
- ఎమ్మెల్సీ కవితక్క చేతుల మీదుగా శంఖుస్థాపనకు ఏర్పాట్లు
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**కరపత్రం రామగిరి ప్రతినిధి డిసెంబర్ 16**
నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షతో సాధించుకున్న తెలంగాణ అస్తిత్వాన్ని కాంగ్రెస్ సర్కార్ దెబ్బతీస్తోందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్టమధూకర్ అన్నారు. సోమవారం రామగిరి మండలం సెంటనరీకాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మలిదశ ఉద్యమాన్ని ముందుకు నడిపించిన గడ్డ రామగిరి గడ్డ అని, ఇక్కడి తెలంగాణ చౌక్ నుంచే సింగరేణి కార్మికులు ఉద్యమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. ఎప్పుడు జేఏసీ పిలుపునిచ్చినా రామగిరి గడ్డ మీదనుంచే ఈ ప్రాంతానికి తెలంగాణ వాదాన్ని వినిపించారని ఆయన అన్నారు. అయితే తెలంగాణ రాష్ట్రంలో అదికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా పాలనపై దృష్టి పెట్టకుండా పేర్లు,రూపాలను మార్చడంపైనే దృష్టి కేంద్రీకరిస్తున్నాడని ఆయన విమర్శించారు. ఈనాడు తెలంగాణ వీరవనిత తెలంగాణ తల్లి రూపు మార్చి తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని అన్నారు. ఆనాడు తెలంగాణ ఉద్యమంలో రూపుదిద్దుతున్న తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడం విడ్డూరంగా ఉందని, ఎవరైనా గొప్పగా తయారు చేయాలనే ఆలోచన చేస్తారే కానీ పాత పద్దతి అంటూ తల్లిని కూడా అలాగే చూపించడం సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ సర్కార్‌కే సాధ్యమైందన్నారు. ఆనాడు మలిదశ ఉద్యమాన్ని ముందుకు నడిపించిన రామగిరి గడ్డపై తెలంగాణ వీర వనిత విగ్రహా ఆవిష్కరణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ కల్వకుంట కవిత చేతుల మీదుగా త్వరలో విగ్రహా ఆవిష్కరణకు శంఖుస్థాపన చేయనున్నట్లు ఆయన తెలిపారు.కాంగ్రెస్ పార్టీ



అధికారంలోకి రానప్పుడు ఒక తీరు, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకతీరుగా వ్యవహరిస్తోందని, సింగరేణి కార్మికులనుసైతం వంచించి మోసం చేసిందన్నారు. సింగరేణి సంస్థను పూర్తిగా నిర్వీర్యం చేసి ముందుకు నడుస్తోందన్నారు. ఒకప్పుడు మంథని ప్రాంతంలో జై తెలంగాణ అనేందుకు భయపడే వాళ్లని, అలాంటి ప్రాంతంలోనే ఆనాడు ఉద్యమ సమయంలో రూపుదిద్దుకున్న తెలంగాణ వీరవనిత, తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం జరుగుతుందని, ఎమ్మెల్సీ కవితక్క చేతుల మీదుగా విగ్రహ ఏర్పాటుకు శంఖుస్థాపన కార్యక్రమానికి తెలంగాణవాదులు, సింగరేణి కార్మికులు, బీఆర్ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శెంకేషి రవీందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూదరి సత్యనారాయణ గౌడ్, మాజీ రైతుబంధు అధ్యక్షుడు మెదరబోయిన కుమార్ యాదవ్, పట్టణాధ్యక్షుడు కాపురబోయిన భాస్కర్, గాజుల ప్రసాద్ ,ex mptc దర్ముల రాజసంపత్, రోడ్డ శ్రీనివాస్, ఏగోలపు మల్లయ్య గౌడ్, మట్ట రాజు, కాటా అనిల్, లడ్డు శ్యామ్, రాచకొండ లక్ష్మణ్, చంటి, సాకేత్, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## మరణించిన రేవతి కుటుంబానికి మానవత్వంతో కోటి రూపాయలు ఇవ్వాలి అల్లు అర్జున్ కు విజ్ఞప్తి..

- జాతీయ మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య...

**కరపత్రం శంకరపట్నం డిసెంబర్ 16**
ముందస్తు సమాచారం ఇచ్చే, సంధ్య థియేటర్ కి అల్లు అర్జున్ వచ్చారని, మీడియాలో చూసాము, అదే నిజమైతే ముందస్తు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేసిన పోలీసులదే బాధ్యత, వారిపై శాఖపరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య డిమాండ్ చేశారు. పోలీస్ డిపార్ట్మెంట్ డిజిపి, నగర కమిషనర్ స్పందించాలని కోరారు. అల్లు అర్జున్ కుటుంబ సభ్యులు డైరెక్ట్ గా అత్యంత చావు బతుకుల మధ్య ట్రీట్మెంట్ తీసుకుంటున్న శ్రీ తేజ్ అనే బాలుని, కుటుంబ సభ్యులను ఇప్పటికీ అల్లు అర్జున్ పరామర్శించకపోవడం చాలా బాధాకరమని, సినిమా హీరోలు సినిమాలోనే కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునే వారిగానే కాకుండా నిజజీవితంలో కూడా బాధ్యత కుటుంబానికి అండగా నిలవాలని తెలియజేశారు. అల్లు అర్జున్ సినిమా కాబట్టి ఆయనకే వర్తిస్తుందని, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీ తేజ్ కు మెరుగైన వైద్యం అల్లు అర్జున్ సొంత ఖర్చులు తో అందించాలని, మానవత్వంతో రేవతి కుటుంబాన్ని ఆదుకునేందుకు అల్లు అర్జున్ కోటి రూపాయలు ఆర్థిక సాయం అందజేయాలని, అదేవిధంగా నిర్మాతల మండలి మా అసోసియేషన్ కూడా మానవత్వంతో రేవతి ప్రమాదంలో గాయపడిన బాలుడు శ్రీ తేజ్ త్వరగా కోలుకోవాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నామని, సినీ ప్రముఖులందరూ బాధిత కుటుంబానికి అండగా నిలవాలని, అంజయ్య విజ్ఞప్తి చేశారు.



## చింతలపల్లె బూత్ అధ్యక్షునిగా తిరుపతిరెడ్డి...



- జిల్లా అధికార ప్రతినిధి సమ్మిరెడ్డి...

**కరపత్రం:శంకరపట్నం డిసెంబర్ 16**
చింతలపల్లె గ్రామ బూత్ అధ్యక్షునిగా తిరుపతిరెడ్డిని నియామకం చేసినట్లు బిజెపి పార్టీ కరీంనగర్ జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా సమ్మిరెడ్డి మాట్లాడారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలం చింతల పల్లె గ్రామంలో బీజేపీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి బిజెపి పార్టీ బూత్ అధ్యక్షునిగా కట్కూరి తిరుపతిరెడ్డి నీ ఏకగ్రీవంగా సమావేశంలో నియామకం చేసినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి , రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు కొమురయ్య శక్తి కేంద్రం ఇన్చార్జి శెట్టి సంపత్, సీనియర్ నాయకులు రేమిడి రాజిరెడ్డి,కేశవేణి అశోక్,దాసరి తిరుమల్ రెడ్డి,పల్లె శివారెడ్డి,బొంతల తిరుపతి,దాసరి వాసుదేవ రెడ్డి,బొంతల రవి,బొంతల సతీష్,పూదరి మల్లేష్,ఉమ్మెంతల శ్రీనివాస్ రెడ్డి,బొమ్మదేని సతీష్,బొమ్మాడి రాజిరెడ్డి,కేశవేణి సది,బొంతల హరీష్,భువన్ తదితరులు పాలుగొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన గ్రూపు 2 పరీక్ష

**కరపత్రం రామగిరి ప్రతినిధి, డిసెంబర్ 16.**
తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమీషన్ గత రెండు రోజులుగా మంథని జెఎన్టియు ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన గ్రూపు 2 పరీక్ష సోమవారం ప్రశాంతంగా ముగిసింది. రెండవ రోజున ఉదయం మధ్యాహ్నం జరిగిన పరీక్షలో 932 మంది అభ్యర్థులకు గాను 482 మంది హజరు కాగా 450 మంది గైర్హాజరైనట్టు ప్రిన్స్ పాల్ చెరుకు శ్రీధర్ రెడ్డి తెలిపారు. పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ పరీక్ష జరుగుతున్న తీరును వరిశీలించారు. అలాగే ప్రత్యేక వరిశీలకులు సురేష్ పరీక్ష నిర్వహణను తిలకించారు. మంథని సిఐ బి రాజు, రామగిరి ఎస్ఐ చంద్రకుమార్ ఆధ్వర్యంలో, రామగిరి పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. అంగవైకలురకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కళాశాల యాజమాన్యం ఏర్పాట్లు చేసింది.




# ఢిల్లీలో సేవరత్న జాతీయ అవార్డు పురస్కారాన్ని అందుకున్న

- ప్రముఖ సంఘ సేవకులు కేజేఆర్ ఫౌండేషన్ అధినేత కొత్వాల్ ఆనంద్ కృష్ణారెడ్డి
- నా సేవలను గుర్తించి అంతర్జాతీయ బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో
- జాతీయ సేవా రత్న అవార్డు పురస్కారాన్ని అందుకోవడం ఆనందంగా ఉంది అన్న
- కేజేఆర్ ఫౌండేషన్ అధినేత ప్రముఖ సంఘ సేవకులు ఆనంద్ కృష్ణారెడ్డి
- సమాజ సేవలో నా వెన్నంటూ ఉంటూ సంపూర్ణ సహకారాన్ని అందించిన
- నా సతీమణి కొత్వాల్ లక్ష్మి ఆనంద్ కృష్ణారెడ్డి నా కుటుంబ సభ్యులకు ఈ అవార్డు అంకితం చేస్తున్న

**కరపత్రం దినపత్రిక సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**
భారతీయ రాజధాని ఢిల్లీలో అంతర్జాతీయ బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో సేవ రత్న జాతీయ అవార్డు పురస్కారాన్ని నేను తలపెట్టిన సామాజిక కార్యక్రమాలు ప్రజా ఉద్యమాలు నిరుపేద పేద ప్రజలకు అందించిన ఆర్థిక సహాయాన్ని ప్రజా చైతన్య కార్యక్రమాలను తలపెట్టి సమాజ శ్రేయస్సు కోసం నిరంతరంతా ప్రతితపిస్తున్న సామాజిక ఉద్యమ సారధి కె.జె.ఆర్ ఫౌండేషన్ అధినేత కొత్వాల్ ఆనంద్ కృష్ణారెడ్డి కి వివిధ రంగాలలో అనేక ప్రముఖ సేవను అందిస్తున్నందున సేవలను గుర్తించి అంతర్జాతీయ బహుజన సాహిత్య అకాడమీ ప్రతిష్టాత్మకంగా అవార్డును ప్రధానోత్సవం చేయడం జరిగింది. అందులో భాగంగా సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ ప్రాంతానికి చెందిన కేజేఆర్ ఫౌండేషన్ అధినేత ప్రముఖ సంఘ సేవకులు ఆనంద్ కృష్ణారెడ్డి నిత్యం ప్రజా శ్రేయస్సు కోసం ప్రజా సేవలో ఉంటూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూ పేదల సంక్షేమం అభివృద్ధి తన ఎజెండాగా ప్రజల శ్రేయస్సు తన కర్తవ్యం గా ప్రజల కొరకు అభాగ్యులకు ఆపన్న ఆస్తంగా అన్నా ఆపద అంటే నేనున్నాను మీకు అండగా అంటూ ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నటువంటి కొత్వాల్ ఆనంద్ కృష్ణారెడ్డి కి అంతర్జాతీయ బహుజన సాహిత్య అకాడమీసంస్థ ఆనంద్ కృష్ణారెడ్డికి భారతదేశ









రాజధాని ఢిల్లీలో అంతర్జాతీయ బహుజన సాహిత్య అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా ప్రతిష్టాత్మకంగా ఘనంగా సన్మానించి అవార్డు పురస్కారాన్ని ప్రధానోత్సవం చేయడం జరిగింది. ఆనంద్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా జాతీయ సేవా రత్న అవార్డు పురస్కారాన్ని నేను అందుకున్నందుకు గర్వపడుతున్నాను అన్నాడు, ఈ సంతోషంతో పాటు నాలో ఇంకా ప్రజలకు మరింత సేవ చేయాలి అనేటువంటి సంకల్పం పెరిగిందని వారు తెలిపారు. నా వెన్న అంటూ ఉంటూ సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం తలపెడుతున్న సామాజిక కార్యక్రమాలు నిరుపేద పేద ప్రజల కు ఆర్థిక సహాయాన్ని అందిస్తు ప్రజా శ్రేయస్సు లక్ష్యంగా ముందుకు వెళుతున్న నాకు నా సతీమణి సంపూర్ణ సహకారాన్ని అందిస్తూ నన్ను ప్రోత్సహిస్తూ నేను సాధించిన విజయాలకు పూర్తి సంపూర్ణ సహకారాన్ని అందించిన నా సతీమణికి కొత్వాల్ లక్ష్మి ఆనంద్ కృష్ణారెడ్డి నా కుటుంబ సభ్యులకు సేవారత్న జాతీయ అవార్డును అంకితం చేస్తున్న అన్నారు,నేను తలపెట్టిన సామాజిక కార్యక్రమాలు ప్రజా ఉద్యమాలు నిరుపేద పేద ప్రజలకు అందించిన ఆర్థిక సహాయాన్ని సామాజిక సేవ కార్యక్రమాలను గుర్తించి అంతర్జాతీయ బహుజన సాహిత్య అకాడమీ భారత దేశ రాజధాని ఢిల్లీలో నాకు జాతీయ సేవా రత్న అవార్డు బహుజన సాహిత్య అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ, బహుజన సాహిత్య అకాడమీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గౌతమ్ సంస్థ ప్రతినిధులు డా.ఏర్పుల శ్రీనివాస్, సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను, అదేవిధంగా నేను తడి పెడుతున్న సామాజిక ఆర్థికపరమైనటువంటి కార్యక్రమాలను పత్రికలలో టీవీ ఛానల్ లో యూట్యూబ్ ఛానల్ లలో ప్రచురణ చేసి నా సేవలను సమాజానికి ప్రచారం చేస్తున్న నా విజయానికి సంపూర్ణ సహకారం అందించిన పాత్రికేయులకు వివిధ ఛానల్ లో ప్రజలకు పేరుపేరునా అభివందనం తెలియజేస్తున్నాను అన్నారు,

## రసభసగా సాగిన వీణవంక ఫ్యాక్స్ సర్వసభ్య సమావేశం....

- నూతన భవనం, గోదాం త్వరలో ప్రారంభం..
- ఫ్యాక్స్ చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి..
- ప్యాడి కమిషన్, గన్ని బ్యాగ్స్ పై సభలో ప్రశ్నించిన రఘునాథ్ రెడ్డి...

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, డిసెంబర్ 16.**
వీణవంక మండల కేంద్రంలోని సోమవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మార్చ్ 1, 2024 - ఆగస్టు 31,2024 లో జరిగిన లావాదేవీలను, లాభనష్టాలను వివరిస్తూ, అర్ధవార్షిక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఫ్యాక్స్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి అధ్యక్షులు వ్యవహరించగా, ఆరు నెలల కాలంలో జరిగిన ఖర్చులు- జమల నివేదికను ఫాక్స్




సీఈవో ప్రకాష్ రెడ్డి చదివి వినిపించారు. అనంతరం రైతులు తమ సందేహాలపై,సమస్యలపై చైర్మన్ తో సభలో చర్చించారు. సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశం రసాభసగా మారింది. రిటైర్డ్ టీచర్ ముదిగంటి రఘునాథ్ రెడ్డి గన్ని బ్యాగ్స్ పై ఇంతవరకు వివరణ ఇవ్వలేదని,అది కాకుండా 2018-2024 వరకు 15 సీజన్లో ప్యాడి కమిషన్ 5 కోట్లకు పైగా వచ్చిందని, ఇంతవరకు పాలకవర్గం వివరణ ఇవ్వలేదని, అవకతవకాలపై విచారణ జరిపిన, అధికారి ఇంతవరకు ఏం వివరణ ఇవ్వలేదని, సహకార సంఘ సభ్యులను పాలకవర్గం నిలువున ముంచుతుందని, రైతుల పక్షాన అవసరమైతే నిరాహార దీక్ష చేపడతానని అన్నారు. చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి వివరిస్తూ.. గతంలో అవకతవకలు జరిగిన మాట వాస్తవమేనని, మా హయాంలో జరిగిన వాటికి మా వద్ద లెక్కలు సరిగానే ఉన్నాయని, గన్ని బ్యాగ్స్ పై ప్రతిసారి దుమారం చేయవద్దని, ఐదు సంవత్సరాల కాలంలో సహకార సంఘాన్ని అభివృద్ధి బాటలో తీసుకువచ్చామని, మండల కేంద్రంలో నూతన భావాన్ని నర్సింగాపూర్ లో నూతన గోదాం నిర్మించడం జరిగిందని కొన్ని రోజుల్లో ప్రారంభించుకోవడం జరుగుతుందని, ఘన్ముక్ల లో నాలుగు గుంటల ప్రభుత్వ భూమిని లో నూతన గోదాం నిర్మాణం చేపట్టడానికి,మా వంతు ప్రయత్నం చేస్తానని, ప్రతి సభ్యుని సహకారంతో వీణవంక ప్రాథమిక సహకార సంఘాన్ని ప్రగతి పథంలో నడిపించామని, ఐదు సంవత్సరాలుగా పాలకవర్గానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫ్యాక్స్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, డైరెక్టర్లు మేరీ, శ్యాంసుందర్ రెడ్డి, మల్లయ్య,రాములు, సమ్మిరెడ్డి,తిరుమల్, శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రైతులురమేష్,కొమురయ్య,ఇంద్రసేనారెడ్డి,సాహెబ్ హుస్సేన్,రఘునాథ్ రెడ్డి, మధు,చరణ్ తదితరులు పాల్గొన్నారు.